క్లుప్తంగా

7నుంచి దస్తగిరిస్వామి ఉరుసు

తుగ్గలి : మండలంలోని జొన్నగిరిలో వెలసిన దస్తగిరిస్వామి, మౌలాలిస్వామి ఉరుసు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో డిసెంబర్ 7వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు దర్గా ముజావర్లు ఓ ప్రకటనలో తెలిపారు. 7న గంధం, 8న ఉరుసు, 9 న జియారత్ వేడుకలు ఉంటాయని వివరించారు. తిమ్మనచెర్ల విజయభాస్కరరెడ్డి ఇంటి నుంచి గంధం ఊరేగింపు ఉంటుందని వెల్లడించారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండండి

పత్తికొండ(తుగ్గలి) : సైబర్‌నేరాలు తీవ్రంగా పెరిగి పోయాయని వాటి పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ గోపాల్ కోరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గురువారం ప్రిన్సిపాల్ మాధురి అధ్యక్షతన సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ..ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటోందని, సెల్‌ఫోన్‌ను చాలా జాగ్రత్తగా ఉపయోగించాలన్నారు. అనవసరమైన లింక్‌లు ఓపెన్ చేయొద్దొని, అనుమానాస్పద మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తితే 1930కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ మాధురి, వైద్యాధికారి ఆదినగేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రామకృష్ణ మాట్లాడారు. ఏటీఎంలో డబ్బు తీసుకునే ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆధార్, పాన్ నంబర్, ఫోన్ నంబర్ ఎవరికీ చెప్పొద్దన్నారు. సామాజిక మాధ్యామాల్లో అనవసర లింకులు తెరవద్దని చెప్పారు.

30న పింఛన్ల పంపిణీ

పత్తికొండ/తుగ్గలి : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ఒక రోజు ముందుగా అంటే.. ఈనెల 30వ తేదీనే పంపిణీ చేయనున్నారు. పత్తికొండ మండలంలో 8,494 మంది పెన్షన్‌దారులకు రూ. 3,62,03,500, తుగ్గలి మండలంలో 7,582 మందికి రూ. 3,21,48,500, వెల్దుర్తి మండలంలో 7,849 మందికి రూ.3,31,99,000, కృష్ణగిరిలో 4,766 మందికి రూ.2,05,06,500, మద్దికెర మండలంలో 4,724 మందికి రూ.1,98,85000 ప్రభుత్వం విడుదల చేసింది. 30న ఉదయం 6 గంటలకు పెన్షన్ల పంపిణీ ప్రారంభమై సాయంత్రం వరకు కొనసాగుతుంది. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ పెన్షన్లు పంపిణీ చేయనున్నట్లు తుగ్గలి ఎంపీడీఓ విశ్వమోహన్, పత్తికొండ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సువర్ణలత తెలిపారు.

బైక్‌లు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

పత్తికొండ(తుగ్గలి) : ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ టీవీ చానల్ విలేకరితో పాటు మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పందికోన ఫారెస్ట్ రోడ్డులో ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో విలేకరి రాతన రాంప్రసాద్, నర్సాపురానికి చెందిన నారాయణస్వామిగాయపడ్డారు. గమనించిన పలువురు.. క్షతగాత్రులను పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం తీవ్రంగా గాయపడిన రాంప్రసాద్‌ను కర్నూలుకు రెఫర్ చేశారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు



వెల్దుర్తి రాజరాజేశ్వరి దేవాలయ ఆవరణలో హోమాల్లో పాల్గొన్న భక్తులు

వెల్దుర్తి(కృష్ణగిరి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక రాజరాజేశ్వరి దేవాలయ ఆవరణంలో గురువారం సాయంత్రం వెల్దుర్తి సేవా సమితి నాయకులు ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో మహా రుద్ర, మృత్యుంజయ హోమం నిర్వహించారు. పరమశివునికి ప్రీతికరమైన ఈ మాసంలో చిత్తా,స్వాతి నక్షత్రాలు కలిసిన శుభ కాలంలో ధన్వంతరి జయంతి సందర్భంగా హోమాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. వెల్దుర్తి ప్రజలు క్షేమం కోరుతూ 116 జంటలతో పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ హోమాలు జరిపించారు. భక్తులతో శ్రీ లక్ష్మి గణపతి, మహారుద్ర, మృత్యుంజయ, ధన్వంతరి, సుదర్శన, నవగ్రహ, కాల భైరవ హోమాలు నిర్వహించారు. సొంత ఖర్చులతో కార్యక్రమాన్ని చేపట్టిన ప్రశాంత్ కుమార్‌ను మాజీ ఎంపీపీ దశరాథరామిరెడ్డి, వాల్మీకి సేవా సంఘం నేత గోపినాథ్‌నాయుడు అభినందించారు.

కోలుకోలేక రైతు మృతి



ఈడిగ విరుపన్న (ఫైల్)

హొళగుంద: పొలంలో విద్యుత్ షాక్‌తో బుధవా రం తీవ్ర అస్వస్థతకు గురైన మండల కేంద్రానికి చెందిన ఈడిగ విరుపన్న (49) అనే రైతు అదే రోజు రాత్రి కోలు కోలేక మృతి చెందాడు. రైతు తన పొలంలో ట్రాక్టర్‌తో పని చేస్తుండగా తెగి పడిన బోరు బావి త్రీఫేస్ లైన్ సర్వీస్ వైర్ తగిలి విద్యుత్ షాక్ కొట్టింది. దీంతో అపస్మారక స్థితిలో పడిపోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక పీ హెచ్‌సీకి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం బళ్లారికి తీసుకెళ్లారు. అయితే అక్కడ కోలుకో లేక మృతి చెందాడు.భార్య ఈడిగ లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మిరామునాయక్ తెలిపారు.

చలికాలం.. జరభద్రం!

- పెరిగిన చలి
- తీవ్రమవుతున్న శీతల గాలులు
- పొంచి ఉన్న వ్యాధుల ముప్పు
- నాలుగు రోజుల నుంచి 18 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత నమోదు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



ఆలూరు పట్టణంలోని ఎల్లార్తి రోడ్డులో గురువారం ఉదయం ఏడు గంటల సమయంలో కమ్మేసిన మంచు

ఆలూరు రూరల్/కృష్ణగిరి: నియోజకవర్గంలో రోజు రోజుకు చలితీవ్రత పెరుగుతోంది. ఉదయం 8 గంటల వరకు పొగ మంచు వదలడం లేదు. సాయంత్రం ఐదున్నర గంటల నుంచే శీతల గాలులు వీస్తున్నాయి. ఆరు గంటల నుంచి చలి ప్రభావం ఉంటోంది. గత నాలుగు రోజుల నుంచి 20 కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు రాత్రి, తెల్లవారు జామున బయటకు రాలేక పోతున్నారు. తక్కువ ఉష్ణోగ్రతలు, శీతల గాలుల నుంచి వ్యాధులు పొంచి ఉంటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఉదయం పొలం పనులకు వెళ్లే రైతు కూలీలు, ఇతర పనులకు వెళ్లే కార్మికులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అలాగే ఉదయం పూట వ్యాయామం వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

పడిపోతున్న ఉష్ణోగ్రతలు..

ఈఏడాది వర్షాలు అధికంగా కురవడంతో నేలలో తేమ అధికంగా ఉంది. అలాగే జలవనరులు పుష్కలంగా ఉండటంతో చలి తీవ్రత అధికంగా ఉంటోంది. ముఖ్య ంగా గ్రామీణ ప్రాంతాల్లో చలి ప్రభావం సాయంత్రం నుంచే కనిపిస్తోంది. ముఖ్యంగా వరి పొలాలు, నీటి ఆధారిత పంటలు సాగు చేస్తున్న పొలాల పై నుంచి వచ్చే తేమ గాలులకు మరింతగా చలి ఉంటోంది. గతేడాది చలి తీవ్రత అంతగా కనిపించలేదు. 21 నుంచి 24 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయితే ఈ ఏడాది నవంబర్ 10వ తేదీ నుంచే మొదలైంది. కాగా గత నాలుగు రోజుల నుంచి తీవ్రత పెరిగింది. కనిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నా యి. 14 నుంచి 19 డిగ్రీల నడుమ నమోదయ్యాయి. ఇక పొగమంచు తీవ్రత అధికంగా ఉంది. సాయంత్రం ఆరున్నర గంటల నుంచే గ్రామాలను కమ్మేస్తుంది. నడిరాత్రి సమయానికి తీవ్రంగా మారుతోంది. ఇక తెల్లవారే సమయంలో అత్యధికంగా ఉంటోంది. ఉదయం ఏడున్నర గంటలు దాటినా వదలడం లేదు.

ఆస్తమా ఉందా.. జాగ్రత్త..

ఆస్తమా ఉన్నవారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. కోడిగుడ్లు, పాల ఉత్పత్తులు, చేపలు వంటి ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోరాదు. కూల్ డ్రింక్స్, ఉప్పు అధికంగా ఉన్న పదార్థాలు, ఫాస్ట్ ఫుడ్ తీసుకోరాదు. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉన్న పదార్థాలు తీసుకోవాలి.

జాగ్రత్తలు ఇలా..

- చిన్న పిల్లల్లో చెవిపోటు, గొంతు నొప్పి, జలుబు, వచ్చే అవకాశం ఉన్నందున సూర్యరశ్మి వచ్చాకే బయటకు పంపించాలి.
- అస్తమా వ్యాధిగ్రస్తులు ఇన్‌హేలర్ వాడేందుకు బదులు ఉదయం సాయంత్రం వేళల్లో వేడి నీటి ఆవిరి పట్టడం మంచిది.
- చర్మ పొడిబారిపోకుండా ఔషధ పూరితమైన లేపనాలు వాడాలి.
- రసాయనాలతో కూడిన సబ్బులకు బదులు మైల్డ్ సోప్స్ వాడటం మంచిది
- గోరువెచ్చని నీటితో స్నానం చేయడం ఆరోగ్యకరం
- చలి గాలుల కారణంగా చర్మ సంబంధిత, ఆస్తమా, గుండె జబ్బులు, చెవి,ముక్కు, గొంతు నొప్పులు వచ్చే ప్రమాదం ఉంది.
- రోజు మూడు నుంచి 9 గ్లాసులు నీటిని తాగడం అలవాటు చేసుకోవాలి
- బీపీ, షుగర్ ఉన్నవారు క్రమం తప్పకుండా వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకోవాలి
- అస్తమా,శ్వాసకు సంబంధించిన సమస్య లున్న వారు మంచులో నడిచే సమయంలో జాగ్రత్తలు పాటించాలి
- అలర్జీలు ఉన్న వారు చలి సమయంలో బయటకు రాకపోవడమే ఉత్తమం.
- జామ, బొప్పాయి, ఆరటి. దానిమ్మ పండ్లు మంచివి.
- చీకటి పడే వరకు బహిరంగ స్థలాల్లో ఆడించకపోవడమే మంచిది. కాచి చల్లార్చిన నీటిని అందివ్వాలి.

ఫ్రిజ్‌లో ఆహారం తినొద్దు..

చలికాలంలో మనం తీసుకునే ఆహారం పట్ల జాగ్రత్తలు వహించాలి. ఫ్రిజ్‌లో ఉండే ఐటమ్స్ అస్సలు తినరాదు. కేవలం వేడి ఆహార పదార్థాలను మాత్రమే తినాలి. చలికాలంలో మద్యంతో పాటు టీ, కాఫీలను అధికంగా తాగుతారు కొందరు. ఇలా అస్సలు చేయరాదు. మద్యానికి దూరంగా ఉండాలి. టీ, కాఫీ రోజుకు రెండు మూడు కప్పులు మాత్రమే తీసుకోవచ్చు. అలాగే కషాయాలు, హెర్బల్ టీలను తాగవచ్చు. దీంతో శరీరం ఎప్పుడూ వెచ్చగా ఉంటుంది. తగినంత నీటిని తీసుకుంటే ద్రవాలు అంది జీవక్రియలు సరిగ్గా ఉంటాయి. చలికాలంలో జ్వరం, దగ్గు, జలుబు వంటివి మూడు రోజులకు మించి వేధిస్తుంటే వెంటనే వైద్యున్ని సంప్రదించాలి.

గుండెకు చలి తిప్పలు..

తరచూ వాతావరణంలో వచ్చే మార్పులు శరీరంపై రకరకాల ప్రభావాల్ని చూపిస్తాయి. చలికాలంలో హార్ట్ పేషెంట్లు జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ కాలంలో అడ్రినలిన్, నారిటలిన్ వంటి హార్మోన్ల లెవల్స్‌లో మార్పులొస్తాయి. ఇవి రక్త ప్రసరణలో మార్పులు తెస్తాయి. అలాగే చలి కాలం రక్తనాళాలు సహజంగా ముడుచుకునే స్వభావాన్ని కలిగి ఉంటాయి. ఇలాంటప్పుడు కొలెస్ట్రాల్ వంటా సమస్యలు పెరిగే ప్రమాదముంది. కాబట్టి చలి కాలం గుండె సమస్యలున్నవాళ్లు వేడిగా ఉన్న ఆహారాన్నే తీసుకోవాలి. తేలికపాటి వ్యాయామాలు చేస్తుండటం ద్వారా రక్త ప్రసరణ సక్రమంగా జరిగేలా చూసుకోవచ్చు.

రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటే..

రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వాళ్లు అత్యసరమైన పని ఉంటే తప్ప బయటకు వెళ్లరాదు. ఇంటి లోపలి ప్రదేశాలు కూడా వెచ్చగా ఉండేలా చూసుకోవాలి. కిటికీలు, తలుపులు ఖచ్చితంగా మూసేయాలి. పండ్లు, కాయగూరలు, నట్స్ ఎక్కువగా తీసుకోవాలి. ఇన్ఫెక్షన్లు రాకుండా కాచి చల్లార్చిన నీటిని తాగాలి. ఆస్తమా సీఏపీడీ, నిమోనియా వంటి శ్వాసకోశ సమస్యలుంటే జాగ్రత్తగా ఉండాలి. కూల్ డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్, ఐస్ వాటర్‌కు దూరంగా ఉంటే మంచిది. ఏసీ గదుల్లో ఎక్కువ సమయం ఉండరాదు.

ఈనెలలో కనిష్ట ఉష్ణోగ్రతల వివరాలు..

తేదీ	కనిష్ట ఉష్ణోగ్రత	గతేడాది ఉష్ణోగ్రత
24	18	22
25	16	21
26	15	22
27	16	22
28	17	22

వ్యాయామం తప్పనిసరి..

చలికాలంలో చలి దెబ్బకు వ్యాయామానికి స్వస్తి చెప్పి దుప్పట్లో దూరిపోతారు. మరి కొంతదరు చలిలో కూడా వ్యాయామం చేస్తారు. కానీ ఈ సీజన్‌లో జాగ్రత్తలతో కూడిన వ్యాయామం చేయడం తప్పనిసరి అని నిపుణులు చెబుతున్నారు. కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలంటున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



చలికాలంలో పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు అధికం. ప్రధానంగా ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి. రోజులో ఉదయం సాయంత్రం 30 నిమిషాల పాటు సూర్యకాంతి పడేలా చూసుకోవాలి. విటమిన్-డీ,సి అధికంగా ఉండే పదార్థాలు తీసుకోవాలి చెవిలో చల్లగాలి వెళ్లకుండా చూసుకోవాలి. జలుబు,దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలి.

– వాహిద్, డాక్టర్, సీహెచ్‌సీ,ఆలూరు,

రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ

పత్తికొండ(తుగ్గలి) : పంటల సాగుపై గురువారం వ్యవసాయ సబ్ డివిజన్‌లోని రైతు సేవా కేంద్రాల సిబ్బందికి గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మోహన్ విజయకుమార్, డీఆర్‌సీ ఏడీఏ బాలవర్ధిరాజు, (కర్నూలు), ఏఓ శౌధరరెడ్డి, శాస్త్ర వేత్తలు మౌనిక, నాగసరోజ.. పప్పుశనగ, వేరు శనగ, పత్తి, మిరప, టమాట, ఉల్లి పంటల సాగుపై శిక్షణ ఇచ్చారు. యాజమాన్య పద్ధతులు, తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. రబీలో సాగుచేసిన పంటలపై పారదర్శకంగా ఈ- పంట నమోదు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి యాజమాన్య పద్ధతులు, పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

హత్య కేసు నమోదు

తుగ్గలి : రాంపల్లిలో బుధవారం జరిగిన ఏకాశి సరోజ హత్యకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హతురాలి భర్త ఏకాశి రామానాయుడుపై కేసు నమోదు చేశామన్నారు. హత్యకు మరి కొందరు ప్రేరేపించారనే అనుమానాలను మృతురాలి కుటుంబ సభ్యులు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఆ కోణంలో కూడా విచారణ చేస్తామని చెప్పారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించండి



బనువనూరులో సీసీ రోడ్లు పనులను పరిశీలించిన పీఆర్ డీఈ ఎన్.మనోహర్

ఆలూరు: సీసీ రోడ్ల పనుల్లో నాణ్యత ప్రమాణాలను సంబంధిత కాంట్రాక్టర్లు పాటించేలా ఏఈలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పనులపై పర్యవేక్షణ చేయాలని ఆలూరు పీఆర్ డీఈ ఎన్.మనోహర్ ఆదేశించారు. గురువారం ఆస్పరి మండలంలోని బనువ నూరు, చిప్పగిరి,నగరడోణ తదితర గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో వేస్తున్న సీసీ రోడ్ల నిర్మాణాలను పరిశీలించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 184 పనులకు గాను రూ.11.45 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

ఉల్లాసంగా కార్తీక వన సమారాధన



కార్తీక వన సమారాధనలో పెన్షనర్లు

పత్తికొండ(తుగ్గలి): కార్తీక మాసం సందర్భంగా పట్టణ శివారులోని శ్రీ నరసింహస్వామి తోటలో గురువారం పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించిన అనంతరం వన భోజనాలు చేశారు. పెన్షనర్లంతా ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. అసోసియేషన్ అధ్యక్షులు టీఎండీ హుసేన్, సభ్యులు వైకుంఠ ప్రతాప్, రాచప్ప, నాగేంద్ర, మాణిక్యరావు పాల్గొన్నారు.

హొళగుంద విద్యార్థుల ప్రతిభ



మెడల్స్, ప్రశంసా పత్రాలు పొందిన విద్యార్థులతో హెచ్‌ఎం, టీచర్లు

హొళగుంద: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అక్టోబర్ నెలలో నేషనల్ ఎడ్యుకేషన్, హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ముంబాయి ఆధ్వర్యంలో జరిగిన ఆల్ ఇండియా స్వచ్ఛ భారత్ ఆర్ట్ కాంపిటీషన్ కార్యక్రమంలో భాగంగా స్కూల్ లెవెల్ వ్యాస రచన, చిత్ర లేఖన పోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. 78 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా 9 మంది ఫస్ట్ గ్రేడ్‌లో నిలిచినట్లు హెచ్‌ఎం నజీర్ అహ్మద్ తెలిపా రు. వ్యాసరచన పోటిల్లో తస్లీమా, నిధ ఫాతిమా, సులేమా, చిత్రలేఖనలో ఉజ్మా కౌసర్, జోయా మహిన్, కలరింగ్‌లో విశ్వాస్, పల్లవి, ఉమ్మి జిక్రా, హర్షిత రాణించినట్లు వెల్లడించారు. వారికి గోల్డ్ మెడల్స్‌తో పాటు ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు. టీచర్లు సమీనా, ఉమా, సంజీవ్, ఆదినారాయణమ్మ, గోపాల్, మీటు నాయక్ పాల్గొన్నారు.

వేలంలో పెరిగిన ఆదాయం



వేలాలు నిర్వహిస్తున్న అధికారులు

మద్దికెర : పెరవలి గ్రామంలోని శ్రీరంగనాథస్వామి దేవాలయంలో గురువారం తలనీలాలు ప్రోగు చేసుకునే హక్కుకు దేవదాయ శాఖ పర్యవేక్షణాధికారి వెంకటేశులు ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంపాటల్లో గతేడాది కంటే రూ.7,400 ఆదాయం పెరిగినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వీరయ్య తెలిపారు. గత ఏడాది రూ.8,40,600కు వేలం పాడగా ఈఏడాది రూ.8.48 లక్షలకు పాటదారులు దక్కించుకున్నారు. అలాగే టెంకాయ చిప్పలు ప్రోగు చేసుకునే హక్కు కోసం వేలంపాడగా గతేడాది రూ.33వేలకు పోగా ఈఏడాది రూ.60 వేలకు దక్కించుకున్నారు. ఫొటోలు విక్రయించేందుకు గతేడాది రూ.65 వేలుకు పోగా ఈ ఏడాది రూ.74 వేలకు పోయందన్నారు.

శనగలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

దేవనకొండ: శనగ పంట సాగుచేసిన రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు సూచించారు. గురువారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పర్యటించారు. రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దాదాపుగా 600 ఎకరాల్లో పప్పుశనగ సాగుచేశారన్నారు. శనగ పైరు పూత దశలో ఉందని, పచ్చ పురుగు, లద్దె పురుగుల ఉధృతి ఉందని, నివారణకు క్లోరాంథానీప్రోల్ (కోరాజన్) 60 ఎం.ఎల్. ఎకరాకు లేదా క్లోరాంథానీప్రోల్ మరియు ల్యాబ్డా సైహాల్‌త్రిన్ (ఆంప్లింగో) 100 ఎం.ఎల్. ఎకరాకు లేదా టెట్రా నిలిప్రోల్ 100 ఎం.ఎల్. ఎకరాకు పిచికారీ చేయాలన్నారు.

● కలకాలం కట్టెలే!



ఎల్లమ్మగుట్టతండా వద్ద కట్టెల మోపులు మోసుకెళుతున్న గిరిజన మహిళలు

తుగ్గలి : పొలాల సమీపంలో, గుట్టల్లో ఎక్కడ ఎండు కట్టెలు, చెట్లు ఎండిపోయి కనిపించినా వాటి కట్టెలు పోగు చేసుకుని మోపులు కట్టి ఇలా నెత్తిన పెట్టుకుని ఇళ్లకు మోసుకెళ్తున్నారు. అన్నింటికీ గ్యాస్ వాడే స్థోమత లేక కట్టెలు వాడుతున్నామని, నీళ్లు కాచేందుకు, రొట్టెలు చేసుకునేందుకు కట్టెల పొయ్యి వినియోగిస్తున్నామని ఎల్లమ్మగుట్ట తండా మహిళలు చెప్పారు. కట్టెల పొయ్యి మీద చేసే వంటల రుచే వేరని పెద్దలు చెబుతుంటారు. ఇంకా గ్రామీణ ప్రాంతాలు, గిరిజన తండాల్లో అక్కడక్కడ కట్టెల పొయ్యి మీద వంటకాలు వండుతున్నారు. గ్యాస్ ధర పెరిగిపోవడంతో అంత మొత్తం వెచ్చించలేక, జనం మళ్లీ కట్టెల పొయ్యిలను ఆశ్రయిస్తున్నారు.

ఫూలేను ఆదర్శంగా తీసుకోండి



ఎల్లార్తిలో జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి



పత్తికొండ కోర్టులో జ్యోతిరావుపూలే చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న జడ్జి ఎంఎస్ భారతి



జ్యోతిరావు పూలే చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పత్తికొండ(తుగ్గలి): మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని గురువారం పత్తికొండలో నిర్వహించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పూలే సేవలు మరువలేని వని జడ్జి ఎంఎస్ భారతి అన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మహేష్, ఉపాధ్యక్షుడు రవి కుమార్, కోశాధికారి రాజశేఖర్, సహాయ కార్యదర్శి వాసు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

దీనజన బాంధవుడు పూలే..

నవ భారత నిర్మాణానికి నాంది పలికిన గొప్ప నాయకుడు, స్త్రీ విద్య కోసం పోరాటం చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని ఎంపీపీ నారాయణదాసు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు కారం నాగరాజు అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగనాయక, మాజీ సర్పంచ్ జయచంద్రారెడ్డి, నాయకులు రవి, మోహన్, దొరస్వామి పాల్గొన్నారు.

బాలికల హైస్కూల్‌లో..

జైభీం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బాలిక ఉన్నత పాఠశాలలో జ్యోతిరావుపూలే వర్ధంతిని నిర్వహించారు. హెచ్‌ఎం భ్రమరాంబ, ఫౌండేషన్ అధ్యక్షుడు ఆవుల సోమన్న, సత్యనారాయణ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

హొళగుంద: మహాత్మ జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకోవాలని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అన్నారు. గురువారం ఎల్లార్తిలో అయ్యప్ప స్వామి ఆలయాన్ని దర్శించుకున్న ఆయన పూలే వర్ధంతిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళలర్పించారు. ఎస్కే గిరి, రాజా, వెంకటేష్, మహదేవ, శివసాయి, మృత్యుంజయ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సైన్స్ అండ్ ఆర్ట్స్ పోటీల్లో రాణించిన విద్యార్థులు



గురుకుల విద్యార్థులను అభినందించిన డీసీఓ శ్రీదేవి

ఆలూరు: విద్యార్థులకు, కృషి పట్టుదలతోనే ఉన్నత లక్ష్యాలను చేరుకోగలరని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి (డీసీఓ) శ్రీదేవి పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో ఈనెల 25,26వ తేదీల్లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన సైన్స్ అండ్ ఆర్ట్స్ పోటీల్లో ప్రతిభ చాటిన అరికెర అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులను గురువారం అభినందించారు. సీనియర్ విభాగంలో సి.సంతోష్, కె.జోసఫ్, కె.ప్రేమరాజ్, డి. శ్రీధర్ రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి లభించింది. జూనియర్ విభాగంలో రుషికుమార్,హెచ్. చిన్నకుమార్‌కు ద్వితీయ బహుమతి లభించింది. ప్రిన్సిపాల్ సి.హెచ్. నరసింహులు, వైస్ ప్రిన్సిపాల్ మనోజ్ రాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి

కృష్ణగిరి: అమకతాడు గ్రామ పంచాయతీ ఎంపీటీసీ సభ్యుడు బోయ ఈరన్న(70) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందగా విషయం తెలుసుకున్న కృష్ణగిరి మండల అధ్యక్షుడు డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి మృతదేహంపై పులమాలవేసి నివాళులర్పించారు. సర్పంచ్ బోయ సర్వేశ్వరి, మాజీ ఎంపీటీసీ మధుసూదన్‌నాయుడు ఉన్నారు.

విద్యార్థినులు పౌష్టికాహారం తీసుకోవాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): విద్యార్థినులు కౌమార దశలో పౌష్టికాహారం తీసుకుంటే శరీరానికి కావాల్సిన కాల్షియం , పొటాషియం, ప్రొటీన్స్, విటమిన్స్ లభిస్తాయని ఆరోగ్య భారతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు కృష్ణవేణి అన్నారు. స్థానిక బీసీ బాలికల వసతి గృహంలో గురువారం సాయంత్రం ధన్వంతరి జయంతి సందర్భంగా ఆహారమే మన ఆరోగ్యం అనే కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

తెర్నెకల్‌లో క్షయవ్యాధి మొబైల్ ఎక్స్‌రే క్యాంపు

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో గురువారం క్షయవ్యాధి మొబైల్ ఎక్స్‌రే క్యాంపు నిర్వహించినట్లు హెల్త్ సూపర్‌వైజర్ రంగస్వామి తెలిపారు. ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం వస్తూ ఉండడం, దగ్గుతో పాటు గళ్ల, గళ్లలో రక్తం పడటం , ఆయాసం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, చెమటలు పట్టడం లాంటి లక్షణాలు ఉంటే తప్పనిసరిగా క్షయవ్యాధి ఎక్స్‌రే తీయించుకోవాలని సూచించారు. అలాంటి లక్షణాలు ఉన్న 142 మంది అనుమానిత రోగులకు కర్నూలు నుంచి వచ్చిన మొబైల్ వాహనం ద్వారా ఉచితంగా ఎక్స్‌రే పరీక్షలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవనకొండ పీహెచ్‌సీ క్షయ వ్యాధి సూపర్‌వైజర్ వీరన్న, జీవిత, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రబీ పంటలకు బీమా చేయించండి

మద్దికెర : మండలంలో రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు పంటల బీమా చేయించుకోవాలని ఏఓ రవి గురువారం తెలిపారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పుశనగ, జొన్న, వరి, వేరుశనగ, ఉల్లి, టమాట పంటలకు డిసెంబర్ 15వ తేదీ లోపు ప్రీమియం చెల్లించాలన్నారు. వేరుశనగ ఎకరాకు రూ.480, పప్పుశనగ రూ.420, జొన్న రూ. 297, ఉల్లి రూ.1350, టమాట రూ.1500 చెల్లించాలన్నారు. అలాగే వరి పంటకు రూ.630 డిసెంబర్ 31వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలని సూచించారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

మద్దికెర : పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించినపుడే ఆరోగ్యంగా ఉంటారని ప్రధానోపాధ్యాయుడు రంగస్వామి, హెల్త్ ఎడ్యుకేటర్ గులాంషేక్ మహబూబ్‌బాషా అన్నారు. గురువారం మండలంలోని పెరవలి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

● ప్రకృతి ఒడిలో పవన సుతుడు



నిర్మాణంలోనున్న 54 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం

ఆలూరు: మండల కేంద్రం సమీపంలో..ఆదోని-బళ్లారి రహదారిలో నేషనల్ హైవే- 167 రోడ్డు పక్కన భక్తులు, దాతలు సహకారంతో 54 అడుగుల ఎత్తున్న ఆంజనేయస్వామి విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. చుట్టూ పచ్చని పంట పొలాలు, గట్టు, ఎత్తైన చెట్లు, పొలాల గట్లపై టెంకాయ చెట్లు ప్రకృతి ప్రేమికులను, భక్తులను ఆకర్షిస్తున్నాయి. ప్రకృతి ఒడిలో స్వామి వారు ఒదిగి ఉండటంతో ఆకర్షణీయంగా మారింది. విగ్రహానికి అర కి.మీ. దూరంలో ఉపాధ్యాయనగర్ కాలనీలో వెలసిన సాయిబాబా మందిరం, జలకంఠేశ్వర స్వామి, అయ్యప్పస్వామి దేవాలయం ఉండటంతో భక్తులు ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదకరమైన ప్రకృతి ఒడిలో సేద దీరేందుకు అవకాశం ఉంటుంది.